తిరుగుబాటుకు సిద్ధం



ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆత్మకూరు వైసీపీలో అంతర్మథనం మొదలైంది. ఎన్నికలకు సిద్ధమా.. అంటూ సీఎం జగన్ సభలు నిర్వహిస్తుంటే.. ఆత్మకూరు మున్సిపాలిటీలో మాత్రం అధికార పార్టీ కౌన్సిలర్లే వైసీపీపై తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. ఎన్నికల వేళ సొంత పార్టీలోనే అసమ్మతి పెరిగిపోవడతో శ్రీశైలం ఎమ్మెల్యేకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులు ఉండగా, అందులో ఒక్క వార్డు మినహా మిగతా వన్నీ వైసీపీ సొంతం చేసుకుంది. తొలుత వార్డు కౌన్సిలర్లు పార్టీకి విధేయులుగానే కొనసాగినప్పటికీ తర్వాత ఆ పార్టీ విధానాలతోపాటు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలతో విసుగు చెందారు. ఈ మేరకు పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

- ఆత్మకూరు వైసీపీలో అంతర్గత విభేదాలు
- వైసీపీని వీడనున్న మున్సిపల్ చైర్‌పర్సన్, మెజారిటీ కౌన్సిలర్లు..?
- ఇప్పటికే అధికార పార్టీ కార్యక్రమాలకు దూరం
- ఎమ్మెల్యే శిల్పా తీరుపై అసంతృప్తి



డాక్టర్ మారూఫ్ ఆసియా



ఎంఏ రషీద్

ఆత్మకూరు, ఫిబ్రవరి 7:

ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా విద్యావంతురాలు. ఆమె తండ్రి, కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్ బంగారు వ్యాపారి. చైర్‌పర్సన్ వర్గానికి తొలి నుంచి ఎమ్మెల్యే శిల్పా తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. వాస్తవానికి పట్టణ ప్రథమ పౌరురాలిగా చైర్‌పర్సన్‌కు అత్యంత ప్రాముఖ్యత ఉంటుంది. పార్టీలో కూడా వారికి తప్పనిసరిగా సముచిత స్థానం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే అలా కాకుండా పట్టణాధ్యక్షుడిగా మరో వ్యక్తికి అవకాశం ఇచ్చి చివరకు ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా ఆయనకే పెత్తనం ఇచ్చారు. దీంతో పలు సందర్భాల్లో పట్టణాధ్యక్షుడిగా ఉన్న అంజాద్‌అలి చైర్‌పర్సన్ టార్గెట్ చేసి పరోక్షంగా ధ్వజమెత్తేవారు. ఈ విషయంపై సాక్ష్యాత్తు చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా మున్సిపల్ కౌన్సిల్ సభలో స్పందిస్తూ పార్టీ కార్యక్రమాలు, ఎమ్మెల్యే పర్యటన సమయాల్లో తమకు నేరుగా ఎమ్మెల్యే నుంచే తమకు సమాచారం రావాలని, ఎవరో ఎక్స్, వై, జెడ్ వ్యక్తులు ఫోన్ చేస్తే తాము రాలేమని తేల్చి చెప్పారు. అంతేకాకుండా ఎవరో ఫోన్ చేసి వెంటనే రమ్మంటే వచ్చేందుకు తామేమీ బానిసలం కామని.. తమకు ప్రాధాన్యత ఇవ్వాలని సభలోనే ఎమ్మెల్యే శిల్పా సాక్షిగా స్పష్టం చేశారు. ఆ సమయంలో ఆమె మాటలు చర్చనీయాంశమయ్యాయి. ఈక్రమంలోనే ఏడాది క్రితం మున్సిపల్ చైర్మన్ తండ్రి ఎంఏ.రషీద్‌తో సహా మరికొంతమంది కౌన్సిలర్లు, అధికార పార్టీకి చెందిన కొంత మంది నాయకులు కలిసి వైసీపీ పట్టణాధ్యక్షుడు అంజాద్‌అలిని తొలగించాలని లేనిపక్షంలో తాము పార్టీకి వీడేందుకు సిద్ధమేనంటూ నంద్యాలకు వెళ్లి మరీ ఎమ్మెల్యే శిల్పాకు అల్టిమేటం జారీ చేసినట్లు తెలిసింది. దీంతో చేసేది లేక వైసీపీ పట్టణాధ్యక్షుడు అంజాద్‌అలిని హుటాహుటినా పదవి నుంచి తప్పించి ఆయన స్థానంలో సయ్యద్‌మీర్‌కు అవకాశమిచ్చారు. తన విషయంలో ఎమ్మెల్యే శిల్పా తీసుకున్న నిర్ణయంపై అంజాద్‌అలి సైతం అసంతృప్తికిలోనై కొంతకాలం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. అయితే ప్రస్తుతం ఆయనకు తిరిగి పార్టీలో ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్‌కు గౌరవం ఇవ్వకపోవడంతో ఆమె వర్గం రగిలిపోతోంది. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే శిల్పా సమక్షంలో ముస్లిం మత పెద్దలతో కలిసి ఓ విషయం నిమిత్తం ఎంఏ.రషీద్ తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్‌ను కలిశారు. అయితే ఈకలయిక రాజకీయాలకు సంబంధం లేదని, కేవలం కమిటీలో బాధ్యతలు ఉండటం వల్లే వెళ్లాల్సి వచ్చిందని ఆయన తన సన్నిహితులతో తెలిపినట్లు సమాచారం.





పార్టీని వీడేందుకు రెడీ?

అధికార వైసీపీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్‌తో సహా 16మంది కౌన్సిలర్లు, ముగ్గురు కోఆప్షన్ సభ్యులు పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే కొంతమంది కౌన్సిలర్లు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని స్వయంగా కలిసి పార్టీలోకి చేరేందుకు ముహూర్తం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. మరికొందరు టీడీపీ అభ్యర్థిగా బుడ్డా పేరు ప్రకటించగానే పార్టీలోకి చేరుతామని సంకేతమిచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అప్రమత్తమయ్యాడు. కేడర్‌ను కాపాడుకునే క్రమంలో నష్ట నివారణ చర్యలకు సమాయత్తమయ్యారు. పార్టీని వీడే వ్యక్తుల స్థానంలో ప్రత్యామ్నాయంగా మరికొందరికి ప్రాధాన్యత కల్పించే దిశగా అడుగులు వేస్తున్నారు.



ఆత్మకూరు పట్టణం ఏరియల్ వ్యూ

కౌన్సిలర్లను కాదని ఇతరులకు వార్డు బాధ్యతలు

ఎన్నికల సమీపిస్తున్న వేళ ఆత్మకూరులోని అన్ని వార్డుల్లో వైసీపీ తరుపున ఇన్‌చార్జిలను నియమించినట్లు తెలిసింది. అయితే ఆయా వార్డులకు అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లే ఇప్పటివరకు ఇన్‌చార్జిలుగా కొనసాగేవారు. అయితే ఇటీవల పలు వార్డుల్లో వైసీపీ కౌన్సిలర్లను కాదని ఎన్నికల కోసం ఇతరులకు వార్డు బాధ్యతలు అప్పగించడంపై వైసీపీ కౌన్సిలర్లు ఆగ్రహంతో ఉన్నారు. ఈ నిర్ణయం తమను అవమానించినట్లే ఆవేదన చెందుతున్నారు. అవమానం గురిచేసే పార్టీలో తామెందుకు కొనసాగాలి..? పార్టీని వీడాల్సిందేనని పలువురు కౌన్సిలర్లు నిర్ణయించుకున్నట్లు తెలిసింది.



అధికార పార్టీ కార్యక్రమాలకు దూరం

ఆత్మకూరులో జరుగుతున్న పలు ప్రభుత్వ పార్టీ కార్యకర్తలకు ఇప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్ సహా పలువురు కౌన్సిలర్లు దూరంగా ఉంటున్నారు. ఇటీవల సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనయుడు సుమారు రూ.50లక్షలు ఖర్చు చేసి కార్తీక్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ నియోజకవర్గ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈటోర్నీ ప్రారంభం, ముగింపు కార్యక్రమాలకు ఆత్మకూరులో అట్టహాసంగా నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమాలకు అన్ని మండలాల నుంచి ముఖ్యనాయకులంతా హాజరయ్యారు. అయితే స్థానికంగా ఉన్న మున్సిపల్ చైర్‌పర్సన్ సహా దాదాపు 15 మంది కౌన్సిలర్లు హాజరు కాకపోవడం అప్పట్లో చర్చనీయాంశమైంది. తాజాగా ఈ నెల 3న ఆత్మకూరు మార్కెట్‌యార్డులో 4వ విడత ఆసరా కార్యక్రమం జరిగితే ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ వర్గం వెళ్లలేదు. గత వారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా ఆసుపత్రిని ప్రారంభించారు. ఇందుకు ఆత్మకూరు చెందిన చాలా మంది ప్రముఖులకు ఆహ్వానం అందించారు. ఈ ప్రారంభోత్సవానికి సంబంధించి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి కనీస సమాచారం ఇవ్వలేదని తెలిసింది. చివరకు ఆయన సోదరుడు శిల్పా భువనేశ్వరరెడ్డి చైర్మన్ తండ్రి ఎంఏ.రషీద్‌కు స్వయంగా ఫోన్ చేసి తమకు ఆసుపత్రి ఓపెనింగ్ ఆహ్వానం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించి రావాలా..? వద్దా..? అని అడిగి మరీ వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది.

శ్రీశైలం చేరుకున్న కేఆర్‌ఎంబీ, ఎన్‌డీఎస్‌ఏ బృందం

శ్రీశైలం, ఫిబ్రవరి 7: శ్రీశైలం డ్యాం సందర్శనలో భాగంగా బుధవారం రాత్రి కేఆర్‌ఎంబీ, ఎన్‌డీఎస్‌ఏ బృందం సభ్యులు సున్నిపెంట జెన్‌కో అతిథి గృహానికి చేరుకుంది. శ్రీశైలం జలాశయం ఎస్‌ఈ శ్రీరామచంద్రమూర్తి, పలువురు ఇంజనీర్లు వీరికి స్వాగతం పలికారు. గురువారం ఉదయం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకోనున్నారు. అనంతరం జలాశయాన్ని చేరుకుని ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ వివేక్ త్రిపాఠి ఆధ్వర్యంలో సభ్యుల బృందంతో కలిసి జలాశయం భద్రత, నీటి నిల్వలు వినియోగం తదితర వాటిని పరిశీలించనుంది. అనంతరం జలాశయం అధికారులతో సమీక్షా నిర్వహిస్తారు. అయితే శ్రీశైలం జలాశయం కేఆర్‌ఎంబీ పరిధిలోనికి తీసుకురానున్న నేపథ్యంలో బృందం సభ్యుల రెండు రోజుల పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది.

మల్లన్న సేవలో బీహార్ ఎమ్మెల్యేలు

శ్రీశైలం, ఫిబ్రవరి 7: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను బుధవారం బీహార్‌కు చెందిన 22 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేలకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరు స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరి వెంట అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఉన్నారు. దర్శనానంతరం ఎమ్మెల్యేలకు ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల ప్రసాదాలను అందజేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు కమిటీ

శ్రీశైలం, ఫిబ్రవరి 7: శ్రీశైలంలోని ప్రధాన రహదారుల వెంట ప్లాస్టిక్ వ్యర్థాలను నివారించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీశైలం క్షేత్రానికి వచ్చే భక్తులు, స్థానికుల ద్వారా శ్రీశైలం ప్రాంతంలో, రహదారుల వెంబడి విచ్చలవిడిగా ప్లాస్టిక్ బాటిళ్లు, పాలిథిన్ సంచులు పారవేస్తుండటం, శ్రీశైలంలో డంప్‌యార్డు సరిగా లేకపోవడం వల్ల జంతు మానవ సంఘర్షణకు దారితీసింది. దీంతో శ్రీశైలం ప్రాంతంలో ప్లాస్టిక్ బాటిళ్లు, పాలిథిన్ సంచుల నిషేధం, జంతు మానవ సంఘర్షణను నివారించడం, తదితర సమస్యలను అధ్యయనం చేసి పటిష్టమైన చర్యలను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీని వేసింది. ఈ కమిటీలో చైర్మన్‌గా కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అండ్ ఫీల్డ్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్, ఆత్మకూరు సభ్య కార్యదర్శిగా ఉంటారు.

ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ బదిలీ

ఆత్మకూరు, ఫిబ్రవరి 7: ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు కడప మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న హరిప్రసాద్‌ను ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. కాగా సుమారు రెండేళ్ల క్రితం ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును గతంలోనే బదిలీ చేయాలని నిర్ణయించుకున్నప్పటికీ పలు కారణాలతో బ్రేక్ పడింది. తిరిగి సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎట్టకేలకు మున్సిపల్ కమిషనర్ బదిలీ జరిగింది.

మహా శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో

శ్రీశైలం, ఫిబ్రవరి 7: శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 1 నుంచి 11 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయ అధికారులు బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, మంచినీటి సరఫరా, ఆరుబయలు ప్రదేశాల్లో విద్యుద్దీపాల ఏర్పాటు, చలువపందిళ్ల ఏర్పాటు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు క్షేత్రానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారని జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. పోలీస్ శాఖ సమన్వయంతో ట్రాఫిక్ నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలని ఆలయ భద్రతా విభాగాన్ని ఆదేశించారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు తగిన నీటినిల్వ లేనందున షవర్ స్నానానికి ఏర్పాట్లు చేపట్టాలన్నారు. క్షేత్రంలోని ప్రధాన కూడళ్లలో తెలుగు, కన్నడ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో సూచికబోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవాల సమయంలో విధులు నిర్వహించే పారిశుధ్యం, పోలీస్, ఆరోగ్యం మొదలైన సిబ్బందికి ఆయా సమయాల్లో అల్పాహారం, భోజనాలను వారివద్దకే పంపే ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఐ జి.ప్రసాదరావు, ఎస్ఐ లక్ష్మణరావు, వివిధ విభాగాల అధిపతులు హాజరయ్యారు.

ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించుకోండి



నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 7: రానున్న సార్వత్రిక ఎన్నికల సమర్థ నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు 16 కమిటీల నోడల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల సంసిద్ధతపై నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను, హ్యాండ్ బుక్కులను నోడల్ అధికారుల క్షుణ్ణంగా చదివి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఎన్నికల విధులను అప్రమత్తంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులను రాండమైజేషన్ పద్ధతిలో కేటాయించేందుకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని మ్యాన్ పవర్ కమిటీ నోడల్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు తరలించే మెటీరియల్, సిబ్బంది అవసరమయ్యే వాహనాల ఏర్పాటు చర్యలు తీసుకోవాలని, యువ ఓటర్ల నమోదుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కొత్త ఓటరు నమోదుకు చర్యలు తీసుకోవాలని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలన, భద్రత, ట్రాన్స్‌పోర్టు, సీలింగ్ తదితర అంశాలపై జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖర్చు వివరాలపై పర్యవేక్షణ, కమ్యూనికేషన్ ప్లాన్, ఎలక్ట్రోరల్ రోల్‌పై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. లా అండ్ ఆర్డర్, బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, మీడియా మెనేజ్‌మెంట్, కంప్లైంట్ రెడ్రస్సల్, కమిటీలను కేటాయించిన పనులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కామేశ్వరరావు అన్ని రకాల కమిటీలు చేయాల్సిన పనులు, చేయకూడని పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణనిచ్చారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా :ఎస్పీ

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 7: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదేశించారు. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి అప్రమత్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో రానున్న సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టడంతో పల్లె నిద్ర కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేసుకొని శాంతియుత పోలింగ్ దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయా పోలీసు సబ్ డివిజన్ల వారీగా పల్లె నిద్ర కార్యక్రమాల ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక సచివాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపట్ల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించాలని సూచించారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి పచ్చ జెండా



- కర్నూలు ఉమ్మడి జిల్లాలో 1,693 పోస్టులు
- టెట్, డీఎస్సీ వేర్వేరుగా నిర్వహణ
- ఈనెల 12 నుంచి దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 7: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి పచ్చజెండా ఊపింది. టెట్, డీఎస్సీ నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేసింది. కర్నూలు ఉమ్మడి జిల్లాలో 1,693 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వానికి జిల్లా పాఠశాలల విద్యాశాఖ ప్రతిపాదనలు పంపింది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు మంజూరయ్యాయి. ఈ నెల 12న డీఎస్సీకి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కానుంది. అదే రోజు నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలు కానుంది. టెట్, డీఎస్సీకి వేర్వేరుగా పరీక్షలు నిర్వహిస్తారు. టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులను డీఎస్సీకి అర్హులుగా ప్రకటిస్తారు. డీఎస్సీలో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. టెట్, డీఎస్సీలకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులకు పేపర్-1, స్కూల్ అసిస్టెంట్లకు పేపర్-2 విడివిడిగా పరీక్షలు నిర్వహిస్తారు. బీఈడీ, నాలుగేళ్ల బ్యాచ్‌లర్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ చదివిన వారు మాత్రమే అర్హులు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 1,693 పోస్టులు ఉండగా.. ఇందులో ఎస్జీటీ (1022), స్కూల్ అసిస్టెంట్లు (550), టీజీటీ (121) కలిపి 671 పోస్టులను భర్తీ చేయనున్నారు.

రైతు ద్రోహి జగన్ రెడ్డి

మండలిలో బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 7: జగన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తున్నదని శాసన మండలి ఉపనాయకుడు బీటీ నాయుడు అన్నారు. బుధవారం శాసన మండలిలో రైతుల సమస్యలపై వాయిదా తీర్మానాన్ని ఇవ్వగా మండలి ఛైర్మెన్ తిరస్కరించాడాన్ని తప్పుపట్టారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన రైతు సమస్యలపై చర్చించేందుకు గంటకు పైగా సమయమున్నప్పటికీ ఉభయ సభల్లో దానిని తిరస్కరించడాన్ని బట్టి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల పట్ల ఎంత వ్యతిరేకతతో ఉన్నదీ తేటతెల్లమైందన్నారు. రైతు సమస్యల గురించి, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల విషయం, విత్తనాలు, ఎరువులు, సాగునీరు వంటి అంశాలపై ఉభయ సభల్లో కోరితే టీడీపీ సభ్యులు పరిష్కార మార్గాలు చూపుతారని ప్రస్తావించగా దాన్ని తిరస్కరించారని అన్నారు. జాతీయ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వల్ల ప్రతి రైతు కుటుంబంపై రూ. 2,25,554 చొప్పున అప్పుపడిందన్నారు. రైతుల ఆత్మహత్యల్లో మన రాష్ట్రం 3వ స్థానంలో ఉందని, రైతు ఆత్మహత్యల్లో 2వ స్థానంలో ఉందని, జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో 4వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని గుర్తు చేశారు.

10 నుంచి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 7: స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ పోటీలను నిర్వహిస్తున్నట్లు కర్నూలు హాకీ కార్యదర్శి దాసరి సుధీర్ బుధవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిన నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయ స్థాయి సబ్ జూనియర్ హాకీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిపితే చర్యలు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 7: అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. బుధవారం నంద్యాల జిల్లా మహానంది మండలం గాజుల పల్లె సమీపంలో సర్వే నెంబర్ 838లో 8,382 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వకాలు జరిపినట్లు గుర్తించామని తెలిపారు. విజిలెన్స్, గనులశాఖ సంయుక్తంగా జరిపిన విచారణలో బీ. సరసయ్య, బీ. వెంకటేశ్వర్లు అక్రమంగా తవ్వకాలు జరిపినట్లు తేలిందని, దీనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్‌యూకు కొత్త రెక్టార్, రిజిస్ట్రార్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 7: రాయలసీమ యూనివర్సిటీ పాలనా సౌలభ్యం కోసం కొత్తగా మార్పులు చేశామని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. నూతన రెక్టార్‌గా ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్‌గా యోగి వేమన యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఎ.అంకన్నలను నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా సీడీసీ డీన్‌గా ప్రొఫెసర్ సీవీ కృష్ణారెడ్డి, పరీక్షల విభాగం డీన్‌గా ప్రొఫెసర్ వెంకట సుందరానంద పుచ్చా, రీసెర్చ్ విభాగం, చీఫ్ వార్డెన్‌గా ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిలను నియమించామన్నారు.

పంచలింగాల చెక్‌పోస్టులో రూ.60 లక్షలు సీజ్



పట్టుబడిన నగదుతో పోలీసులు

కర్నూలు, ఫిబ్రవరి 7: కర్నూలు నగర శివారులో పంచలింగాల చెక్‌పోస్టులో కర్నూలు తాలుకా పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున పోలీసులు తనిఖీలు చేపట్టారు. హైదరాబాదు నుంచి బెంగళూరు వెళ్తున్న కేఎస్‌ఎం ప్రైవేటు ట్రావెల్స్ బస్సును తనిఖీ చేయగా ఇద్దరి నుంచి రూ.60 లక్షల నగదును గుర్తించారు. నగదుతో పట్టుబడిన వారు బెంగళూరుకు చెందిన అనంత ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి చెందిన జిలాని, సుమన్‌లుగా గుర్తించారు. వీరి వద్ద ఈ నగదుకు సంబంధించిన ఎలాంటి రికార్డులు లభించలేదు. సీజ్ చేసిన ఈ నగదు మొత్తాన్ని రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకుని ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగించారు. ఈ తనిఖీల్లో సీఐ శ్రీధర్, సెబ్ ఎస్ఐ పృథ్వీరాజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లస్కర్లకు పదోన్నతి

- 12 ఏళ్ల నిరీక్షణకు తెర
- శ్రీశైలం ముంపు బాధితులకు న్యాయం

కర్నూలు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న లస్కర్ల 12 ఏళ్ల నిరీక్షణ ఫలించింది. ఏకకాలంలో 39 మంది లస్కర్లకు పదోన్నతి కల్పిస్తూ జలవనరులు శాఖ ప్రాజెక్టుల సీఈ కబీర్‌బాషా కీలక నిర్ణయం తీసుకున్నారు. సీనియారిటీ, విద్యార్హతలను బట్టి 24 మందికి అటెండర్లుగా, 9 మందికి జూనియర్ అసిస్టెంట్లుగా, ఐదుగురికి టైపిస్టులుగా, ఒకరికి జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించారు. శ్రీశైలం జలాశయం నిర్మాణంలో భాగంగా ఇళ్లు, భూములు కోల్పోయిన ముంపు బాధితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి న్యాయం చేయాలనే సంకల్పంతో దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జీవో నంబరు 98 తీసుకొచ్చారు. ఆ జీవో మేరకు 2012లో దాదాపు 532 మందికి ఔట్ సోర్సింగ్ విధానంలో లస్కరు ఉద్యోగాలు ఇచ్చారు. అయితే తమను రెగ్యులర్ చేయాలని విన్నవిస్తూ వస్తున్నారు. అర్హతలు ఉన్నా ఏ ఒక్కరు స్పందించ లేదు. అయితే వీరి సమస్యపై స్పందించిన సీఈ కబీర్‌బాషా సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపించారు. అనుమతి తీసుకొని వారి విద్యార్హతలు, సీనియారిటీ ప్రకారం ఒకేసారి 39 మందికి పదోన్నతి ఇవ్వడం కొసమెరుపు. సీఈ తీసుకున్న కీలక నిర్ణయంపై పదోన్నతి పొందిన లస్కర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నలుగురికి ఐదేళ్ల జైలు శిక్ష

దేవనకొండ, ఫిబ్రవరి 7: మండలంలోని తెర్నేకల్ గ్రామానికి చెందిన బాటమీది రాజు, చిన్న వెంకప్ప, కొలంట్ల తిమ్మప్ప, బెల్లందొడ్డి చిన్న హనుమంతులకు పత్తికొండ కోర్టులో మెజిస్ట్రేట్ ఐదేళ్లపాటు జైలు శిక్ష, రూ.18 వేల జరిమానా విధించినట్లు దేవనకొండ పోలీసులు తెలిపారు. 2014లో సూర్యనారాయణ అనే వ్యక్తిపై నిందితులు దాడి చేయడంతో వీరిపై కేసు నమోదైంది.

ఎండు మిరప ధర పతనం

- రెండు రోజుల్లో రూ.2 వేలు తగ్గిన వైనం
- ఆందోళనలో రైతులు



ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 7: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎండుమిరప ధర బుధవారం పతనమైంది. ఎండుమిరప ధర గరిష్ఠంగా క్వింటాలు రూ.20 వేలు పలికింది. రెండు రోజుల్లో క్వింటానికి గరిష్ఠంగా రూ.2 వేలకు పైగా ధర తగ్గింది. తెగుళ్ళ, వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ ఏడాది మిరప దిగుబడి గణనీయంగా తగ్గిందని, వచ్చిన అరకొర దిగుబడి సైతం ధరలు పతనం అవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్యాడిగి రకం ఎండుమిరప క్వింటం గరిష్ఠంగా రూ.20,009 పలకగా, కడ్డీ బ్యాడిగి రకం రూ.18,009 పలికింది. 1,714 బస్తాలు ఎండుమిర్చి విక్రయానికి రాగా, వాటి క్వింటాలు కనిష్ఠ ధర రూ.5,889 గరిష్ఠ ధర రూ.20,009, మధ్యస్థ ధర రూ.16,205 పలికింది.

చిత్తగించిన 'గరుసు' దొంగలు

- వారిని పిలిపించి విచారిస్తాం
- అనుమతులు తప్పనిసరి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కొండల్లో కనిపించని వాహనాలు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 07 : ఎట్టకేలకు గరుసు దొంగలు అరేకల్లు కొండల నుంచి చిత్తగించారు. ఆదోని వైసీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి లెఫ్ట్ హ్యాండ్ గురునాథ్‌రెడ్డి అధికార అండదండలతో ప్రభుత్వ అనుమతి లేకుండా వందల లారీల మట్టిని అక్రమంగా అరేకల్లు కొండల నుంచి తరలిస్తున్నాడని బుధవారం ఆంధ్రజ్యోతి గరుసు దొంగల అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. దీనికి రెవిన్యూ అధికారులు స్పందించి అరేకల్లు కొండల్లోని మట్టి తవ్వకాల వద్దకు వెళ్లే లోపు సదరు అధికార పార్టీ గరుసు దొంగ వాహనాలతో, మనుషులతో సహా అక్కడి నుంచి పారిపోయారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హసీనా సుల్తానా మాట్లాడుతూ, సర్వే నెం. 3లో అక్రమ గరుసు తవ్వకాలను నిలిపేశామని, దీంతోపాటు తవ్వకాలకు కారణమైన వారిని పిలిపించి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎర్రమట్టి (గరుసు) కావాల్సిన వారు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని, లేనిపక్షంలో వాహనాలను సీజ్ చేసి కారకులపై కేసులు నమోదు చేస్తామని అన్నారు.

కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతం

- కోలుకోవడంతో రోగి డిశ్చార్జ్
- అభినందించిన హాస్పిటల్ సూపరింటెండెంట్



కిడ్నీ మార్పిడి చేసుకున్న రోగితో నెఫ్రాలజి వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 7: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 26 ఏళ్ల ఓ రోగికి నిర్వహించిన కిడ్నీ మార్పిడి ఆపరేషన్ విజయవంతమైంది. 2019లో డోన్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి కర్నూలు జీజీహెచ్‌లో మొట్టమొదటిసారిగా కిడ్నీ మార్పిడి చేశారు. నాలుగేళ్ల తర్వాత మళ్లీ సి. బెళగల్‌కు చెందిన 26 ఏళ్ల వీరన్నకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ను నెఫ్రాలజీ, యురాలజీ వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. వీరన్న తల్లి కిడ్నీ ఇవ్వడానికి అంగీకరించడం, ఇద్దరిది ఒకే గ్రూపు రక్తం కావడంతో కిడ్నీ మార్పిడి ఆపరేషన్ సాధ్యపడింది. ఆరు సంవత్సరాలుగా వీరన్న కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. గత 6 నెలలుగా డయాలసిస్ చేయించుకుంటున్నారు. క్రియాటిన్ ఎక్కువగా ఉండటం తప్పనిసరిగ్గా వైద్యులు కిడ్నీ మార్పిడి చేయాలని సూచించారు. దీంతో రోగి జనవరి 26న నెఫ్రాలజీ వార్డులో అడ్మిషన్ పొందారు. వైద్యులు అన్ని పరీక్షలు పూర్తి చేసి జనవరి 29న నెఫ్రాలజీ విభాగపు హెచ్‌వోడీ డా. ఆనంత్, యురాలజీ విభాగపు హెచ్‌వోడీ డా. సీతారామయ్య, నెఫ్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.ఫక్కిరెడ్డి, డా.శ్రీధర్ శర్మ నేతృత్వంలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఆపరేషన్ అనంతరం కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ వార్డు (ఐసీయూ)లో ఉంచి రోగికి చికిత్స అందించారు. రోగి కోలుకుని ఆరోగ్యంగా ఉండటంతో బుధవారం వార్డు నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌కు బయట రూ.6 నుంచి 8 లక్షలు ఖర్చు అవుతుందని, అయితే రోగికి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా నిర్వహించామన్నారు. రెండో కిడ్నీ మరో ఆపరేషన్ చేసిన యురాలజీ, నెఫ్రాలజీ వైద్యులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకట రంగారెడ్డి అభినందించారు.

వాము ధర పైపైకి

చేతివాటం చూపుతున్న వ్యాపారులు



కర్నూలు యార్డులో విక్రయానికి తెచ్చిన వాము

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 7: కర్నూలు మార్కెట్ యార్డుకు విక్రయానికి తెచ్చిన వాము రైతుల పంట పండింది. కేవలం ఒక్క రోజు వ్యవధిలో రూ.1000 అదనంగా పెరిగింది. బుధవారం కర్నూలు నగరంలోని మార్కెట్ యార్డులో ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి రైతులు 1153 క్వింటాళ్ల వామును విక్రయానికి తెచ్చారు. గరిష్ఠంగా రూ.23,699, మధ్యస్థ ధర రూ.16,099, కనిష్ఠ ధర రూ.2,002 చేరడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ఇదే అదనుగా వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. రైతులు తెచ్చిన వామును తూకం వేసిన తర్వాత మిగిలే కిలోల వామును ఏదో ఒక రేటుకు నిర్ణయించి ఆ మొత్తాన్ని రైతుల చేతిలో పెడుతున్నారు. దీని వల్ల రైతులు బాగా నష్టపోతున్నారు. ఈ వ్యవహారంపై మార్కెట్ కమిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. అదే విధంగా కందుల ధర కూడా కర్నూలు మార్కెట్ యార్డులో భారీగా పలుకుతోంది. గరిష్ఠంగా రూ.10,403, మధ్యస్థ ధర రూ.10,249, కనిష్ఠ ధర రూ.599 నిర్ణయించారు. శనగలకు క్వింటంపై గరిష్ఠ ధర రూ.6,139, మధ్యస్థ ధర రూ.6,129, కనిష్ఠ ధర రూ.1,010 రైతులకు దక్కింది. ఉల్లిగడ్డలకు కూడా గత నెలతో పోలిస్తే.. ధర పెరుగుతూ వస్తోంది. క్వింటం ఉల్లి ధర గరిష్ఠంగా రూ.1,531, మధ్యస్థ ధర రూ.1,319, కనిష్ఠ ధర రూ.655లకు చేరింది. ఎండుమిరప కాయలకు ధర క్రమంగా పెరుగుతోంది. గరిష్ఠ ధర రూ.22,009, మధ్యస్థ ధర రూ.14,599, కనిష్ఠ ధర రూ.899లకు చేరడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ కాయల ధర మాత్రం గరిష్ఠంగా రూ.7,213, మధ్యస్థం రూ.5,091, కనిష్ఠ ధర రూ.2,812 రైతులకు లభించింది.

టీడీపీలోకి బైరెడ్డి సిద్ధార్థ ముఖ్య అనుచరుడు?

ఐదు వేల మందితో చేరికకు సన్నాహాలు



మంత్రి రోజా, బైరెడ్డి సిద్ధార్థతో శ్రీరాములు (ఫైల్)

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 7: ఓ స్థాయి నాయకులు, అధికారుల సేవలను వాడుకుని వదిలేయడం వైసీపీకి మొదట్నుంచీ ఉన్న అలవాటే. 'ఏరు దాటే వరకు ఓడ మల్లన్న ఏరు దాటాక బోడి మల్లన్న' అన్నట్లుగా వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. టీడీపీతో పాటు చంద్రబాబును పదే పదే తిట్టిపోయాలని యువతను రెచ్చగొట్టి, తిరిగి వారికి మొండి చేయి చూపుతోంది వైసీపీ. ఈ క్రమంలో అలా ఆ పార్టీలో విసిగి వేసారిన కొందరు టీడీపీ వైపు చూస్తున్నారు. తాజాగా శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కీలక అనుచరుడు, విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ ఛైర్మన్ శ్రీరాములు వైసీపీకి గుడ్‌బై చెప్పనున్నారు. ఐదువేల మందితో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరేందుకు ఆయన రంగం సిద్ధం చేసుకున్నారు. విద్యార్థి, ఉద్యోగ, ప్రజా సంఘాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఆయన టీడీపీలోకి చేరబోతున్నారు. విద్యార్థులకు జగన్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని, వైసీపీ మద్దతు ఇస్తే రాబోయే రోజుల్లో విద్యార్థులు తీవ్ర అన్యాయం చేసిన వారమవుతామని, విద్యావ్యవస్థను కాపాడుకోవాలని ఆయన భావిస్తున్నారు. గతంలో జగన్ ప్రభుత్వానికి అనుకూలంగా ఎన్నో ఉద్యమాలు చేశారు. 3 రాజధానులకు మద్దతుగా రాయలసీమ జిల్లాల్లో వాదనను బలంగా వినిపించేందుకు చేపట్టిన ఉద్యమానికి కీలక నాయకుడిగా పని చేశారు. ఇదిలా ఉండగా శ్రీరాములు టీడీపీలో చేరబోతున్నారని తెలిసిన శ్రీరాములుపై పాత కేసులు తిరగతోడాలని వైసీపీకి చెందిన పార్టీ పెద్దలు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

మహానందిలో ప్రదోషకాల పూజలు



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది,ఫిబ్రవరి 7: మహానంది క్షేత్రంలో బహుళ త్రయోదశి పురస్కరించుకొని బుధవారం సాయంత్రం ఘనంగా నందీశ్వరునికి ప్రదోషకాల పూజలను ఆలయ వేదపండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సుగంధ ద్రవ్యాలతో వేదపండితులు రవిశంకర్ అవధాని, శివాలయం అర్చకులు కొమ్మద్ది శంకయ్యశర్మ ఆలయం ప్రాంగణంలోని రాతి నందీశ్వరుని విగ్రహానికి పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎర్రమల్ల మధుతో పాటు సిబ్బంది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

13 నుంచి ఏపీ ఎన్జీవోస్ ఉద్యమ బాట



ఐక్యత చాటుతున్న నాయకులు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 7: ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల పెన్షనర్ల పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 13 నుంచి దశలవారిగా ఉద్యమానికి ఏపీ ఎన్జీవోస్‌లు పిలుపునిచ్చారు. బుధవారం రాష్ట్ర, జిల్లా ఏపీ ఎన్జీవోస్ సంఘాల ఆదేశాల మేరకు నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్న అధ్యక్షతన వ్యవసాయ శాఖ ఏడీఏ కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 100 నెలల డీఏ బకాయిలు, 11 పీఆర్సీ బకాయిలు, జీపీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ రుణాలు, సరెండర్ లీవులు మూడు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉద్యోగులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సాయిరాం, హేమలత, స్వరూప్, వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, వరలక్ష్మి, హరికృష్ణ, శంకర్, కిషోర్ పాల్గొన్నారు.

కారు దూసుకొచ్చి తల్లీ కూతుళ్ల మృతి

హనుమాపురంలో విషాదం



అక్షర(ఫైల్)



జయలక్ష్మి (ఫైల్)

పెద్దకడుబూరు , ఫిబ్రవరి 7: పెద్దకడుబూరు మండలంలోని హనుమాపురం గ్రామంలో తల్లీ కూతుళ్లపైకి మృత్యువు కారు రూపంలో దూసుకొచ్చింది.. ఈ ప్రమాదంలో వారిద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన బుధవారం జరిగింది. హనుమాపురం గ్రామానికి చెందిన జయలక్ష్మి(37), ఆమె మరిది కుమార్తె అక్షర(6) ఆదోని- ఎమ్మిగనూరు హైవేపై పొలానికి వెళ్తున్నారు. ఆదోని నుంచి ఎమ్మిగనూరు వైపు వస్తున్న కారు డ్రైవర్ వేగాన్ని నియంత్రించలేకపోవడంతో.. రోడ్డు చివరలో పొలానికి వెళ్తున్న జయలక్ష్మి, అక్షరలపైకి దూసుకెళ్లింది. ఆ ఇద్దరినీ కారు ఫర్లాంగు దూరం ఈడ్చుకెళ్లిడంతో అక్కడికక్కడే వారు మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ శ్రీనివాసులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు పెద్దకడుబూరు పోలీసులకు సమాచారం అందజేశారు. 108 అంబులెన్స్‌లో మృతులను ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలు జయలక్ష్మికి భర్త దస్తగిరి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సంఘటనపై పెద్దకడుబూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామంలో విషాదం

ఈ ఘటనతో హనుమాపురం గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. ప్రమాదం జరిగిన విషయం తెలియగానే కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతులను చూసి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. అప్పటి వరకు తమ కళ్ల ముందు ఆడుకుంటూ పొలానికి వెళ్తానని మారం చేసిన పాప పది నిమిషాలకే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు

వ్యక్తిపై కత్తితో దాడి

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 7: ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీలోని వివేకానంద గ్రంథాలయం ముందు భాగంలో రోడ్డుపై వ్యక్తిని కత్తితో పొడిచిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పట్టణ వాసులు, పోలీసుల వివరాల మేరకు.. వెంకటాపురం కాలనీకి చెందిన గుజ్జుల సోమేష్‌పై వెంకటాపురానికి చెందిన రామాంజనేయులు, కుక్కల సోమేష్, మల్లెపూల వెంకటేష్, కురువ అయ్యన్న, కొండయ్య అలియాస్ రంగయ్య, గోవిందు కలిసి కత్తితో దాడి చేశారని పోలీసులు తెలిపారు. గుజ్జుల సోమేష్ కొంతకాలం నుంచి వెంకటాపురం కాలనీకి చెందిన రామాంజనేయులు ఇంటి అమ్మాయిని వేధిస్తున్నాడని మూడు నెలల క్రితం పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీన్ని మనసులో పెట్టుకున్న రామాంజనేయులు బుధవారం సోమేష్ ఒంటరిగా కనిపించడంతో దాడి చేసినట్లు బాధితుడి భార్య కేశమ్మ ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాత్రికి రాత్రే రిజిస్ట్రేషన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నందవరం, ఫిబ్రవరి 7: మండలంలోని హాలహర్వి గ్రామంలో జగనన్న స్థలాల కబ్జా అనే వార్త ఆంధ్రజ్యోతి మెయిన్‌లో ప్రచురితం కావడంతో రాత్రికి రాత్రి పట్టాలపై సచివాలయంలో అధికారులు రిజిస్ట్రేషన్ చేయించారు. సర్వే నెంబర్ 407లో 117 మందికి ఒకటిన్నర సెంటు ప్రకారం ప్రభుత్వం ఏడాదిన్నర క్రితం జగనన్న ఇంటి స్థలాలను కేటాయించింది. పట్టాలు ఇచ్చి జియోట్యాపింగ్ కూడా చేశారు. అయితే కొంత మంది వైసీపీ నాయకుల అనుచరులు ఆ స్థలాన్ని కబ్జా చేసి కొట్టాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో పట్టాదారులు అధికారుల చుట్టూ తిరిగారు. అయితే ఎవ్వరూ పట్టించు కోలేదని గత 3 రోజుల క్రితం సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మను కలిశారు. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో అధికారులు మంగళవారం రాత్రి దాదాపు 20 మంది పట్టాదారులకు సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. మిగతా వారికి 10 తేదిలోపు రిజిస్ట్రేషన్ చేయిస్తామని అన్నారు.

రిజిస్ట్రేషన్లు చేయించి హద్దులు చూపాలంటూ ధర్నా

జగనన్న పట్టాలు ఇచ్చిన నాయకులు, అధికారులు తమకు రిజిస్ట్రేషన్ చేయించి, హద్దులు చూపాలని హాలహర్వి గ్రామానికి చెందిన పట్టాలు పొందిన మహిళలు నందవరం తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఓబులేసుకు తమ గోడును విన్నవించుకున్నారు.

అందరికీ రిజిస్ట్రేషన్ చేయిస్తాం

పట్టా లబ్ధిదారులు వచ్చి అర్జీలు ఇచ్చారు. పట్టాలున్న ప్రతి ఒక్కరికీ రిజిస్ట్రేషన్ చేయిస్తాం. ఆర్డీవోతో మాట్లాడి అందరికీ న్యాయం చేస్తాం.

-ఓబులేసు తహసీల్దార్

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

బిల్లులు అందవు

పనులు సాగవు

నందికొట్కూరు పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన మంచినీటి పథకాన్ని వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. 109.18 కోట్లతో చేపట్టిన పట్టణ ప్రజలకు అవసరమైన మంచి నీటి పథకానికి బిల్లులు చెల్లించకపోవడంతో అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి. నీటి సరఫరాలో కీలకమైన పైపులైన్ల గురించి పట్టించుకోకుండా ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. దీంతో తాగునీరు ఎక్కడి నుంచి తెచ్చి నింపుతారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

నందికొట్కూరు ఫిబ్రవరి 7:

నందికొట్కూరు మున్సిపాల్టీలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.109.18 కోట్లు విడుదల చేసింది. ఈ పథకంలో భాగంగా మిడ్తూరు మండలం అలగనూరు జలాశయం నుంచి సుమారు 19 కి.మీ మేర పైపులైను ఏర్పాటు చేసి పట్టణానికి నీటిని తరలించాల్సి ఉంది. అయితే ఈ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. పట్టణంలోని 29 వార్డుల పరిధిలో 16 వేల గృహాలకుపైగా ఉన్నాయి. వీటిలో 56,500 మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. ఇంటింటి కుళాయి కనెక్షన్లు సుమారు 9000 ఉన్నాయి. అలగనూరు జలాశయం నుంచి పట్టణానికి తాగునీరు అందించాలన్నది పథకం లక్ష్యం. ప్రస్తుతం అలగనూరు జలాశయం కట్ట కుంగిపోవడంతో చుక్కనీరు లేదు. దీంతో నందికొట్కూరు నీటి పథకానికి నీటి లభ్యతపై స్పష్టత కరువైంది. మరోవైపు పైపులైను పనులు నేటికీ ప్రారంభం కాకపోవడంతో లక్ష్యం నీరుగారిపోతోంది.

● స్థల సేకరణలో విఫలం:

సంపు, ఫిల్టర్ బెడ్‌ల నిర్మాణానికి అవసరమైన స్థలం కోసం అధికారులు నేటికీ అన్వేషిస్తున్నారు. గతంలో భూమి విక్రయించేందుకు ముందుకొచ్చిన యజమాని ప్రస్తుతం నిరాకరిస్తున్నారు. స్థానిక అధికారులు మాత్రం ఇతర ప్రాంతంలో భూమి కోసం వెతుకుతున్నారు. ఉన్నతాధికారులు మాత్రం ఆ స్థలం యజమానితో మాట్లాడి ఒప్పించి పనులు ప్రారంభమయ్యే విధంగా చూడాలని ఆదేశించినట్లు సమాచారం. స్థలం ఎప్పుడు సేకరిస్తారో..నీటి నిల్వ, శుద్ధి కేంద్రాల నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంద కోట్లతో చేపట్టిన తాగునీటి పథకం నిధులు లేకపోవడంతో మధ్యలోనే నిలిచిపోయిందని అధికారులే చెబుతుండడంతో ఈ ప్రభుత్వానికి పట్టణ ప్రజలపై ఏ మేరకు చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చు.

● నిలిచిపోయిన పనులు:

పట్టణంలోని 29 వార్డులకు నీటిని తరలించేందుకు కర్నూలు రహదారిలోని బీఆర్‌ఆర్ నగర్‌లో 900 కేఎల్, పగిడ్యాల రహదారిలోని బీఆర్ నగర్‌లో 1000 కేఎల్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద 1300 కేఎల్, నీలి షికారి కాలనీలో 1100 కేఎల్ సామర్థ్యంతో నాలుగు ఓహెచ్ ఆర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. నీలిషికారి కాలనీలోని పాఠశాల ఆవరణలో పనులు చేపట్టడంతో కోర్టు ఆదేశాల మేరకు అర్ధాంతరంగా నిలిపివేశారు. ప్రస్తుతం మూడు ప్రాంతాల్లో పనులు చివరి దశకు చేరుకున్నాయి. నిర్మాణం చేస్తున్న సంస్థకు బిల్లులు ఆగిపోవడంతో పనులు నిలిచిపోయాయి.

» మధ్యలోనే నిలిచిపోయిన ట్యాంకుల నిర్మాణం
» పైపులైన్ పనులను పట్టించుకోని వైనం
» నందికొట్కూరు ప్రజల దాహార్తి తీరేనా..?



పట్టణంలోని తాలుకా ఆఫీసు రోడ్డులో నిలిచిపోయిన వాటర్ ట్యాంకు నిర్మాణం పనులు

కుక్కల బారి నుంచి కాపాడండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 7 : పట్టణంలో వీధి కుక్కలు, దోమల బారి నుంచి ప్రజలను కాపాడాలని సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. బుధవారం నంద్యాలలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డిని కలిసి సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజు రోజుకూ వీధి కుక్కల బెడద ఎక్కువైందని, కుక్కల దాడుల్లో చిన్నారులు, ప్రజలు తీవ్ర గాయాలకు గురి కావాల్సి వస్తున్నదని అన్నారు. పట్టణంలో దోమలు అధికంగా వృద్ధి చెందడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో భూమని శ్రీనివాసులు, సుబ్బరాయుడు, బాషా పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి



పాణ్యం ఎస్ఐకు వినతి పత్రం ఇస్తున్న బీసీ కాలనీ వాసులు

పాణ్యం, ఫిబ్రవరి 7 : స్థానిక బీసీ కాలనీలో వటర్ ట్యాంకు కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీసీ కాలనీ వాసులు పోలీసులను, తహసీల్దారును కోరారు. బుధవారం ఎస్ఐ అశోక్, తహసీల్దారు ఫణికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కాలనీలోని వాటర్ ట్యాంకు చుట్టుపక్కల ఉన్న స్థలాన్ని ఆక్రమించుకోవాలన్న ఉద్దేశంతో ట్యాంకు కూల్చారన్నారు. వచ్చేది వేసవి కాలం కావడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ట్యాంకును నిర్మించి తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భాస్కర్, ప్రతాప్, శివ, మురళి, అక్బర్‌బాష, ఖాదర్‌బాష, మహిళలు పాల్గొన్నారు.

కర్రసాము పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులతో మారుతీకుమార్

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 7 : సౌత్ ఇండియా కర్రసాము చాంపియన్ షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి నంద్యాల జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించినట్లు జిల్లా కర్రసాము అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ మజీద్ తెలిపారు. బుధవారం నంద్యాలలోని సెవెన్‌హిల్స్ హాస్పిటల్‌లో క్రీడాకారులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ మజీద్ మాట్లాడుతూ నెల్లూరులో ఫిబ్రవరి 4న జరిగిన సౌత్ ఇండియా కర్రసాము పోటీల్లో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన జిల్లా క్రీడాకారులు మినీ సబ్ జూనియర్ విభాగంలో అథితి బంగారు పతకం, సబ్ జూనియర్స్ విభాగంలో ప్రణితేజేశ్వరరెడ్డి, మేఘన, అనస్రాజయ, సింధు, రుష్యగా బంగారు పతకాలు, క్యాడెట్ విభాగంలో మహమ్మద్ ఉబైదుల్లా, సీనియర్ విభాగంలో మసూల్‌షాకీద్ బంగారు పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను, సెవెన్‌హిల్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండీ రెంటల మారుతీకుమార్, అబ్దుల్ మజీద్, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

వైసీపీ చిత్తుగా ఓడిపోవడం ఖాయం



క్రీడా కిట్లు పంపిణీ చేస్తున్న ఫిరోజ్, బుగ్గ రాముడు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 7 : వైసీపీ చిత్తుగా ఓడిపోవడం ఖాయమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. బుధవారం నంద్యాలలో 38వ వార్డులో టీడీపీ సీనియర్ నాయకుడు, వార్డు ఇన్‌చార్జీ తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, నాయకులు వార్డులోని ఇంటింటికి తిరిగి టీడీపీ మినీ మ్యానిఫెస్టో సూపర్ -6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు వైసీపీ ప్రజా వ్యతిరేక పాలనతో విసిగిపోయారని అన్నారు. అనంతరం 38వ వార్డులోని యువతకు వాలీబాల్, క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాటికొండ మహేష్, పట్టణ మహిళా అధ్యక్షురాలు విజయగౌరియాదవ్ పాల్గొన్నారు.

కొలనుభారతి అభివృద్ధికి కృషి

కొత్తపల్లి, ఫిబ్రవరి 7: కొలనుభారతి ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని రాష్ట్ర శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి అన్నారు. బుధవారం కొత్తపల్లి మండలం శివపురం గ్రామ శివారులోని కొలనుభారతి ఆలయ పాలక మండలి ఛైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ సమక్షంలో ఆలయ ఈవో మోహన్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం పాలక మండలి ఛైర్మన్ బోయ వెంకటనాయుడు, సభ్యులు వెంకటేష్, శివమ్మబాయి, సునీత, సోముల రామిరెడ్డి, చంద్రకళావతమ్మ, మణికంఠేష్‌లతో ఆలయ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఈవో రామసుబ్బయ్య, సింగిల్ విండో ఛైర్మన్ గౌరు జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఆలయ అధికారులు

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అల్లీనగరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి వస్తున్న తహసీల్దార్ రామచంద్రుడు

మహానంది, ఫిబ్రవరి 7: మహానంది మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను బుధవారం మండల తహసీల్దార్ బి.రామచంద్రుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలింగ్ సిబ్బందికి, ఓటు హక్కు వినియోగించుకొనే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కొన్ని పాఠశాలల్లో విద్యుత్, టాయిలెట్స్, తాగునీరు సమస్య ఉండటం గుర్తించామని, త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన రెవెన్యూ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. వీరి వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేంద్రనాథ్‌రెడ్డి, పర్యవేక్షకులు రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయండి

కొత్తపల్లి, ఫిబ్రవరి 7: పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయా గ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులను తహసీల్దార్ తిరుపతయ్య ఆదేశించారు. బుధవారం మండలంలోని జానాలగూడెం, బలపాలతిప్ప, కపిలేశ్వరం, పాతమాడుగుల, ఎర్రమటం, గుమ్మడాపురం, ముసలిమడుగు, శివపురం గ్రామాల్లోని ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాలు తనిఖీ

గోస్పాడు, ఫిబ్రవరి 7: మండలంలోని యాళ్లూరులో ఉన్న 276, 277 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ భార్గవి, డిప్యూటీ తహసీల్దార్ విజయశేఖర్ తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఉండాల్సిన కనీస సౌకర్యాలను పరిశీలించారు. బీఎల్‌వోలతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలల్లో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అన్నారు.

● రానున్న ఎన్నికలపై సెక్టోరియల్ అధికారులతో బుధవారం తహసీల్దార్ భార్గవి సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలలో ఉన్న వసతులు, ఓటర్ల జాబితా, బీఎల్‌వోలపై సమీక్షించారు. ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా కలిసి పని చేద్దామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయశేఖర్, ఎంపీడీవో నాగ అనసూయ, ఏవో స్వప్నిక, పీఆర్ఏఈ రాజశేఖర్‌రెడ్డి, ఎంఈవో అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 7: పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులును వినతి పత్రం సమర్పించారు. 60 ఏళ్ల పైబడిన ఉద్యోగులు, చంటిబిడ్డల తల్లులు, గర్భిణులుగా ఉన్న ఉపాధ్యాయినులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. సిబ్బందికి పోలింగ్ కేంద్రాల్లో తగిన వసతులు, పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. కలెక్టర్ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు.



శివపురం పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ తిరుపతయ్య



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ భార్గవి, డీటీ విజయశేఖర్

అవయవ దానం అభినందనీయం



పావనీలత చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, ఫిబ్రవరి 7: బ్రెయిన్ డెడ్ అయిన పావనీలత అవయవాలను ఆమె తల్లిదండ్రులు దానం చేయడం ఆదర్శనీయమని వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షుడు బొల్లు ప్రసాద్‌బాబు అన్నారు. బుధవారం ఆర్టీసీ బస్టాండ్‌లో పావనిలత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కర్నూలు జనరల్ ఆసుపత్రి ద్వారా తొలిసారిగా అవయవదాన ప్రక్రియ విజయవంతం కావడం సంతోషకరమని అన్నారు. చిన్నవయస్సులోనే పావనిలత బ్రెయినడెడ్‌కు గురవడం బాధాకరమే అయినప్పటికీ ఆమె తల్లిదండ్రుల చూపిన చొరవ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అవయవదానంతో మరొకరికి ప్రాణం పోయవచ్చునన్న భావన వారిలో కలగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గనుముల పుల్లయ్య, నాగంపల్లి మాజీ సింగిల్ విండో డైరెక్టర్ జంబుల్లయ్య, న్యాయవాదులు భాస్కర్, అంకిరాజు పాల్గొన్నారు.

కరువు నివారణపై అవగాహన సదస్సు

పాణ్యం, ఫిబ్రవరి 7 : ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఏపీడీ బాలాజీ నాయక్ అధ్యక్షతన కరువు నివారణ కార్యాచరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాణ్యంను కరువు మండలంగా ప్రకటించారని అన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అమృత్ సరోవర్, మినీ అమృత్ సరోవర్, పండ్ల తోటల పెంపకం, ఫారం పండ్, డగ్ అవుట్ తవ్వకాలపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ఈఓఆర్డీ సులోచన, ఏపీవో విజయరాణి, ఈసీ శివారెడ్డి, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలు చేయాలి

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 7 : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, సీపీఎస్ కన్వీనర్ రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ నాయకులు ధర్నా చేశారు. ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రామ్మోహన్, రమణ, రమాకాంత్, సుజాత, షమీమ్ బాను పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 7: గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీపీఎం నాయకులు రత్నమయ్య, రాజు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం పెద్దదేవళాపురం పారిశుధ్య కార్మికులతో కలిసి ఎంపీడీవో సగిలి విజయరావుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రెక్కాడితే కాని డొక్కాడని పారిశుధ్య కార్మికుల వేతనాలు నెలల కొద్దీ పెండింగ్‌లో ఉంచటం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. సర్పంచ్‌ల ద్వారా పెండింగ్ వేతనాలు అందేలా చూడాలన్నారు.

ఓటర్ల జాబితాలోని తప్పులను సరి చేస్తాం

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 7: తుది ఓటర్ల జాబితాలోని తప్పులను సరి చేస్తామని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఓటర్ల జాబితా, స్ట్రాంగ్ రూముల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్వో పద్మజ, కాంగ్రెస్ పార్టీ తరఫున సయ్యద్ రియాజ్ బాషా, తెలుగుదేశం పార్టీ తరఫున శివ రాముడు, వైసీపీ తరఫున సాయి రాంరెడ్డి, బీజేపీ తరఫున చంద్రశేఖర్, సీపీఐ తరఫున నరసింహులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు సూచించిన అంశాలను పరిగణలోకి తీసుకొని ఓటరు జాబితాలోని తప్పొప్పులను సరి చేస్తామని వెల్లడించారు. సమావేశంలో ఈఆర్వోలు, ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు.

పేదల కోసమే వైద్య శిబిరాలు



శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ మారూఫ్ ఆసియా

ఆత్మకూరు, ఫిబ్రవరి 7: పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట పట్టణంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమాన్ని వారు సందర్శించారు. అక్కడ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అంతేగాకుండా వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో వైద్యాధికారులు, మున్సిపల్ పాల్గొన్నారు.

జన సైనికునికి ఆర్థిక సహాయం

వెలుగోడు, ఫిబ్రవరి 7 : వెలుగోడు పట్టణానికి చెందిన జనసేన నాయకులు షేక్ ఖాజహుస్సేన్ రోడ్డు ప్రమాదంలో గాయాల పాలయ్యాడు. బుధవారం శ్రీశైలం నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు చికిత్స నిమిత్తం రూ 5,500 నగదు ఆర్థిక సహాయం అందజేశారు. పార్టీగా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో ప్రముఖ న్యాయవాది అభిమన్యుడు, ఆత్మకూరు నాయకులు బొజ్జా శేషకుమార్, శ్రీరాములు, పురం హరీష్, శాలుబాషా, రాజేష్, ఫాహిద్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

నందవరంలో 10 నుంచి మహా కుంభాభిషేకం

బనగానపల్లె, ఫిబ్రవరి 7: మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో మహా కుంభాభిషేక మహోత్సవం ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామానుజన్ బుధవారం తెలిపారు. గర్భాలయంలోని అమ్మవారి విగ్రహానికి స్వల్ప మరమ్మతు పనుల కారణంగా అమ్మవారి నిజరూప దర్శనం రద్దు చేశామని అన్నారు. మూల విరాట్ స్థానంలో గర్భాలయం ఎదురుగా ఉన్న మండపం లోని శ్రీచక్రం వద్ద బాలాలయం ఏర్పాటు చేసి అక్కడ అమ్మవారి ప్రతి రూపాన్ని ప్రత్యేకంగా మేడి చెక్కతో తయారు చేసి ప్రాణ ప్రతిష్ఠ చేసి మూడున్నర అడుగుల అమ్మవారి విగ్రహానికి తాత్కాలికంగా పూజలు నిర్వహిస్తున్నారు.

చందాకు వెళ్లితే వైసీపీ కండువా కప్పారు

● టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య



సమావేశంలో మాట్లాడుతున్న జయసూర్య

నందికొట్కూరు ఫిబ్రవరి 7: గ్రామస్తులతోపాటు సుంకులమ్మ గుడి నిర్మాణం కోసం చందాకని వెళ్లితే వైసీపీ కండువా కప్పి తమ పార్టీలో చేరుకునే ప్రయత్నం చేయడం హేయమైన చర్య అని టీడీపీ రాష్ట్ర ఎస్సీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య అన్నారు. బుధవారం అల్లూరులోని మాండ్ర శివానందరెడ్డి ఇంటి వద్దకు శాతనకోట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు కృష్ణుడు, సురేష్ వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాతకోట గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త సుధాకర్ పిలుపుతో గ్రామంలో జరుగుతున్న సుంకులమ్మ గుడి నిర్మాణానికి చందా అడిగేందుకు శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వద్దకు వెళ్లామన్నారు. దీంతో అక్కడే ఉన్న శాతనకోట సర్పంచ్ జనార్దన్‌గౌడ్ టీడీపీ కార్యకర్తలు వైసీపీలో చేరుతున్నట్లు బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి చెప్పి కండువాలు కప్పారని తెలిపారు. పార్టీలకు అతీతంగా చందాలకు వెళితే వైసీపీ కండువా కప్పడం దారుణమన్నారు. సమావేశంలో మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ మోసాలను ప్రజలకు వివరిస్తాం



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్

నందికొట్కూరు ఫిబ్రవరి 7: బీజేపీ మోసాలను ప్రజలకు వివరిస్తామని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. నందికొట్కూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం స్వామినాథ కమిటీ సిఫార్సులు అమలు చేసి వ్యవసాయాన్ని లాభాలలోకి తీసుకొస్తామని ఇచ్చిన హామీ పదేళ్లవుతున్నా అమలుకు నోచుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

మోదీ క్యాంటిన్ ఏర్పాటుకు అనుమతివ్వాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అభిరుచి మధు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 7: నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో మోదీ క్యాంటిన్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్ డా. కె. శ్రీనివాసులుకు నంద్యాల బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న అన్నా క్యాంటీన్‌లో పేదలకు ఉచితంగా భోజనం అందించేందుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. అనుమతి ఇస్తే సొంత ఖర్చులతో అభిరుచి సేవాసమితి ద్వారా ఉచితంగా భోజన వసతి కల్పిస్తామన్నారు.

నందీశ్వరునికి విశేష పూజలు

శ్రీశైలం, ఫిబ్రవరి 7: శ్రీశైల క్షేత్రంలో బుధవారం త్రయోదశి ఘడియలను పురస్కరించుకొని సాయంప్రదోష కాలంలో ఆలయంలోని మల్లికార్జున స్వామికి అభిముఖంగా కొలువైవున్న నందీశ్వరస్వామికి పరోక్షసేవగా విశేష అభిషేకం, అర్చనలు జరిపించారు. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతి పూజ నిర్వహించారు. అనంతరం నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా అన్నాభిషేకం జరిపారు. అలాగే సాక్షి గణపతికి, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్ర స్వామికి అభిషేక పూజలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న అర్చకులు

కొనసాగుతున్న ఉత్సవ పల్లకి



ఏవీ సుబ్బారెడ్డి ఇంటి వద్ద పూజలందుకుంటున్న ఉత్సవ పల్లకి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 7: అహోబిళం నారసింహస్వామి ఉత్సవ పల్లకి కొనసాగుతోంది. బుధవారం ఆళ్లగడ్డ పట్టణంలో ఉత్సవ పల్లకిపై శ్రీవారు విహరించారు. పట్టణంలోని ఏవీ సుబ్బారెడ్డి ఇంటి వద్ద కుటుంబ సభ్యులు, ప్రజలు పల్లకికి పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం

మాజీ మంత్రి భూమా అఖిలప్రియ


రుద్రవరంలో మాట్లాడుతున్న భూమా అఖిలప్రియ

రుద్రవరం, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం రాత్రి రుద్రవరంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి మేనిఫెస్టో కర పత్రాలు పంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కక్ష సాధింపు పాలన తప్ప చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. మూడు రాజధానులని ఏ ఒక్క చోట నిర్మించిన దాఖలాలు లేవన్నారు. అభివృద్ధిలో కూడా మూడు ముక్కలాటే చేశారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు విఖ్యాత్‌రెడ్డి, నారాయణ, పోలా గురుమూర్తి, మాజీ సర్పంచ్ ఎర్రం ప్రతాప్‌రెడ్డి, రెక్కల మనోహర్‌రెడ్డి, చంద్రశేఖర్, నంద్యాల పార్లమెంటు ఎస్సీ సెల్ కార్యదర్శి రాజారావు, సత్యంరాజు, ఫక్కీరయ్యగౌడ్, సురేష్, కాంత్ పాల్గొన్నారు.

తొలిసారి ఓటు వేసే యువత మేల్కోవాలి

ఆళ్లగడ్డ: వచ్చే ఎన్నికల్లో తొలిసారి ఓటు వేసే యువత మేల్కోవాలని మాజీ మంత్రి అఖిలప్రియ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆమె స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె తమ్ముడు భూమా విఖ్యాత్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. దేశ, రాష్ట్రాభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. యువతకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మద్యం షాపుల్లో అమ్మకాలు జరుపుకునే ఉద్యోగం ఇచ్చి గొప్పలు చెప్పుకుంటోందన్నారు. ఇంజనీరింగు, డిగ్రీలు చదివిన యువతకు 2.30 లక్షలు ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం వలంటీర్ల ఉద్యోగాలు ఇచ్చి వెట్టి చాకిరి చేయించుకుంటోందని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో యువత ఏమి చేయలేక ప్రక్క రాష్ట్రాలలకు వెళ్లి కూలి పని చేసుకొని జీవితం గడుపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నారా లోకేశ్ చేపట్టిన యువగళం యాత్రలో యువత ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తారని తెలిపారు. ఉమ్మడి ఏపీలో అధికారంలో ఉన్నప్పుడు సీఎం చంద్రబాబునాయుడు యువత కోసం ఎన్నో కంపెనీలను అందుబాటులోకి తెచ్చి ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు. ఆళ్లగడ్డ పట్టణంలోని రామలింగారెడ్డి కళ్యాణ మండపంలో గురువారం తొలిసారి ఓటు వేస్తున్న యువతకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు టీడీపీ యువ నాయకుడు భూమా విఖ్యాత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చాంద్‌బాషా, సల్లా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులతో పోషకాహార లోపం: డీఎంహెచ్‌వో


శిరివెళ్లలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకట రమణ

శిరివెళ్ల, ఫిబ్రవరి 7: చిన్నారుల్లో నులిపురుగులు ఏర్పడడం వల్ల పోషకాహార లోపం, రక్తహీనత కలుగుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకట రమణ అన్నారు. శిరివెళ్లలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఆరోగ్య సిబ్బందితో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ నెల 9న చేపట్టనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో పిలుపునిచ్చారు. అనంతరం నులిపురుగుల నిర్మూలన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం, రాష్ట్రీయ బాల స్వాస్థ్య ప్రోగ్రాం అధికారి కాంతారావు నాయక్, వైద్యులు దివ్య, ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, ఈవోపీఆర్డీ నాగేంద్రుడు, మహబూబ్ బాషా, ముజఫర్ నాయక్ పాల్గొన్నారు.

చాగలమర్రి: జాతీయ నులి పురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ తులశమ్మ, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, వైద్యులు ఇమ్రాన్, ఎంఈవో న్యామతుల్ల పిలుపునిచ్చారు. బుధవారం చాగలమర్రి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ గుళికలను పంపిణీ చేశారు. సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. 10,200 మంది విద్యార్థులకు ఈ నెల 9న గుళికలను విద్యార్థులకు మింగించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవో నాగమణి, హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల పాల్గొన్నారు.

రుద్రవరం: పాఠశాలల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వైద్యాధికారి నవీన్‌కుమార్, ఎంపీ డీవో రామచంద్ర బుధవారం పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ వెంకట్రాముడు, హౌసింగ్ ఏఈ నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్ బాబయ్య, ఎంపీహెచ్‌వో నాగ ప్రసాద్ పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు టీకాలు వేయించండి


మాట్లాడుతున్న జిల్లా పశువైద్య అధికారి గోవిందనాయక్

బనగానపల్లె, ఫిబ్రవరి 7: గొర్రెలు, మేకలకు వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలని జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ గోవిందనాయక్ పశు వైద్య అధికారులు, సిబ్బందిని కోరారు. బుధవారం బనగానపల్లె పట్టణంలోని పశువైద్యశాలలో బనగానపల్లె పశువైద్యశాఖ ఏడీ డాక్టర్ మారుతీ సకారం ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ డివిజన్ పశుసంవర్ధకశాఖ వైద్యాధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువైద్య సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ప్రతి పాడి రైతుకు ప్రభుత్వం అందించే పథకాలు అర్హులందరికీ అందించాలన్నారు. పాడి రైతులకు అందించే సంక్షేమ కార్యక్రమాలు పాడి రైతులందరికీ చేర్చాలన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ పశువైద్యశాఖ ఏడీ రమణయ్య, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ బ్రహ్మం, డాక్టర్ గిడ్డయ్య, డాక్టర్ కొండయ్య, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ మోహన్‌రావు, బనగానపల్లె డివిజన్ పశువైద్య అధికారులు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ రాంకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నష్టాల ఊబిలో ఉల్లి రైతులు


ఉల్లి పంటను చూపుతున్న రైతు సంఘం నాయకులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 7: మండలంలో ఉల్లి సాగులో రైతులు అధిక సంఖ్యలో నష్టాల పాలవుతున్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో ఉల్లి పంటను రంగాపురం గ్రామంలో పొలాల్లో పరిశీలన చేశారు. బుధవారం ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన ఉల్లి రైతు క్రిష్టన్న, ఉల్లిని సాగు చేశాడు. ఒక ఎకరాకు ఉల్లి సాగు చేయడానికి రూ.80వేలు ఖర్చు అవుతుందని ఆవేదన రైతులు వ్యక్తం చేశారు. కూలీలకు రూ.30వేలు, పొలాల్లో మందులు, ఎరువులకు రూ.25వేలు, ఉల్లి సాగైన తర్వాత తీసేందుకు రూ.30వేలు ఖర్చు అవుతుందని ఆ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లి కొనుగోలు చేసే వ్యాపారులకు రూ.800 నుంచి రూ.900 అడుగుతున్నారు. ఖర్చులు పోను మిగిలిందేమీ లేదని, చేను కౌలుకు చేతి నుంచి డబ్బులు ఇవ్వాల్సివస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి.సుబ్బరాయుడు, మండల కార్యదర్శి రామ్మోహన్, రైతులు పాల్గొన్నారు.

టీడీపీతోనే పేదల సంక్షేమం


టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

చాగలమర్రి, ఫిబ్రవరి 7: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, అబ్దుల్ ఖాదర్ అన్నారు. బుధవారం చాగలమర్రిలోని మల్లెం వీధిలో టీడీపీ నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. నవరత్నాల పేరుతో దగా చేశారని ఆరోపించారు. వైసీపీ అరాచక పాలనకు ప్రజలే చరమగీతం పాడతారని అన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు కె.రమేష్, శ్రీను, పుల్లన్న, మహిళలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉత్సవ పల్లకి


ఏవీ సుబ్బారెడ్డి ఇంటి వద్ద పూజలందుకుంటున్న ఉత్సవ పల్లకి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 7: అహోబిళం నారసింహస్వామి ఉత్సవ పల్లకి కొనసాగుతోంది. బుధవారం ఆళ్లగడ్డ పట్టణంలో ఉత్సవ పల్లకిపై శ్రీవారు విహరించారు. పట్టణంలోని ఏవీ సుబ్బారెడ్డి ఇంటి వద్ద కుటుంబ సభ్యులు, ప్రజలు పల్లకికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించండి



తువ్వపల్లెలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు

రుద్రవరం, ఫిబ్రవరి 7: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని తహసీల్దారు మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని నరసాపురం, తువ్వపల్లె, రెడ్డిపల్లె, నాగులవరం, తిప్పారెడ్డిపల్లె గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మం డలంలో 51 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేసి వాటిల్లో మౌలిక సౌకర్యాలు చేకూర్చాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

చాగలమర్రి, ఫిబ్రవరి 7: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నియామవళిని తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ రమణమ్మ అన్నారు. బుధవారం చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరల్ అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల పరిసరాలను పరిశీలించి నివేదికలు తయారు చేయాలని అన్నారు. తాగునీరు, ఫర్నీచర్, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపు సౌకర్యాలు ఉన్నాయా లేదా చూడాలని ఆదేశించారు. మండలంలో 52 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో మౌలిక వసతులు కల్పించేలా చూడాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులను పరిశీలించి నివేదికలు సమర్పించాలని అన్నారు. కార్యక్రమంలో డీటీ విజయ్‌కుమార్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

శివస్వాముల పూజలు

చాగలమర్రి, ఫిబ్రవరి 7: మండలంలోని డి.వనిపెంట గ్రామంలో దీక్ష చేపట్టిన శివస్వాములు మాస శివరాత్రి సందర్భంగా ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. 15 మంది భక్తులు శివమాల ధరించి 40 రోజుల పాటు దీక్ష చేపట్టారు. మహా శివరాత్రి పండుగ రోజు శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకొని దీక్ష ముగిస్తామని గురుస్వాములు మల్లారెడ్డి, బాలవీరయ్య తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి

రుద్రవరం, ఫిబ్రవరి 7: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో రామచంద్ర అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ కులగణన సర్వే, హౌసింగ్ రిజిస్ట్రేషన్ల విషయంలో వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ, ఈకేవైసీ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో సురక్షితంగా ప్రయాణించండి



మాట్లాడుతున్న డీఎం తిరుపతయ్య

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 7: ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసి సురక్షితంగా గమ్యస్థానం చేరండని కోవెలకుంట్ల డిపో మేనేజరు తిరుపతయ్య పేర్కొన్నారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని శ్రీవాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోవెలకుంట్ల డిపో మేనేజరు తిరుపతయ్య మాట్లాడుతూ రహదారులపై వాహనాల్లో వెళ్లే సమయంలో ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజరు శేఖర్, అధ్యాపకులు కృష్ణదాసు, రాజశేఖర్, భాస్కర్‌నాయక్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణలో డీఎస్పీ



పుస్తకావిష్కరణ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్(రూరల్), ఫిబ్రవరి 7: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు జీవిత చరిత్ర పుస్తకాన్ని డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డోన్ బీసీ సంక్షేమ సంఘం నాయకుడు ఏఈ నాగరాజు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం నక్కలమిట్ట శ్రీనివాసులు ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మహ్మద్ రఫి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు హుశేన్‌పీరా, మల్లికార్జున స్వామి, దూదేకుల సిద్దు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం


చిన్నవంగలిలో రంగు మారిన తాగునీరు

చాగలమర్రి, ఫిబ్రవరి 7: మండలంలోని చిన్నవంగలి గ్రామంలో తాగునీటి కొళాయిల ద్వార రంగు మారిన కలుషిత నీరు వస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోగాల బారిన పడతామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. వారం రోజులుగా రంగు మారిన నీరు వస్తుండటంతో ప్రజలు నీరు తాగేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నీరు తాగితే రోగాలు రావా అంటూ ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి తాగునీటి కొళాయిలకు కలుషిత నీరు రాకుండా చూడాలని కోరుతున్నారు. కలుషిత నీరు వస్తుండటంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జంగయ్యను వివరణ కోరగా పైపుల లీకేజీ ద్వారా నీరు కలుషితమై ఉండవచ్చని, లీకేజీలను గుర్తించి కలుషిత నీరు రాకుండా తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.

డోన్ ఆర్డీవోగా మహేశ్వరరెడ్డి

డోన్, ఫిబ్రవరి 7: డోన్ ఆర్డీవోగా మహేశ్వరరెడ్డి బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లాలో తహసీల్దార్‌గా పని చేస్తున్న మహేశ్వరరెడ్డికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. డోన్ ఆర్డీవోగా ప్రభుత్వం నియమించింది. అదే విధంగా డోన్ తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. పులివెందుల తహసీల్దార్‌గా పని చేస్తున్న మాధవ కృష్ణారెడ్డిని డోన్ తహసీల్దార్‌గా బదిలీ చేశారు. 13 ఏళ్ల క్రితం డోన్ తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల డీటీగా మాధవకృష్ణారెడ్డి పని చేశారు.

నూతన తహసీల్దార్‌ను కలిసిన వీఆర్వోలు

డోన్(రూరల్), ఫిబ్రవరి 7: డోన్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మాధవకృష్ణారెడ్డిని మండలంలోని వీఆర్వోలు మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన బాధ్యతలు తీసుకున్న మాధవకృష్ణారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ముందస్తు అరెస్టు

చాగలమర్రి, ఫిబ్రవరి 7: ఆశా వర్కర్లను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని స్టేషన్‌లో ఉంచారు. పది మంది ఆశా వర్కర్లకు నోటీసులను అందజేశారు. చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తే పోలీసు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల అధ్యక్ష, కార్యదర్శులు పెద్దక్క, శివలక్ష్మి మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకోవడం వల్ల ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి ఔదార్యం

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 7: మండలంలోని మాయలూరు గ్రామ ఉన్నత పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించి ఆ పాఠశాల విద్యార్థి రమేష్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. పిచ్చి మొక్కల వల్ల పాఠశాల పాఠశాల ఆవరణలోకి పాములు వస్తున్నాయని విద్యార్థులు ఆందోళనకు గురవుతుండడంతో వెంటనే స్పందించారు. తన సొంత నిధులతో ఎక్స్‌కవేటర్ ద్వారా మొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. దీంతో పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

సంజామల ఎస్‌ఐగా రమేశ్‌రెడ్డి

సంజామల, ఫిబ్రవరి 7: సంజామల ఎస్‌ఐగా రమేశ్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కొలిమిగుండ్ల ఎస్‌ఐగా పనిచేస్తున్న రమేశ్‌రెడ్డి బదిలీపై సంజామలకు వెళ్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతుల జాబితా సిద్ధం చేయండి

రుద్రవరం, ఫిబ్రవరి 7 : ఉద్యాన పంటలు సాగు చేసే రైతుల జాబితా సిద్ధం చేయాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ సాంబశివరావు అన్నారు. బుధవారం రుద్రవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఎన్నికల కోడ్ రాక ముందే 400 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేసే రైతులను గుర్తించాలన్నారు. జాబ్‌కార్డులు వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. కలెక్టరు ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ ముందే రైతులను గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్ర, ఏపీవో ప్రతాప్, ఈసీ సుబ్బన్న, సిబ్బంది పాల్గొన్నారు.

తుండ్లవాగు రిజర్వాయర్‌కు నీటి విడుదల

రుద్రవరం, ఫిబ్రవరి 7: అడుగంటిన తుండ్లవాగు రిజర్వాయరు అన్న కథనానికి గంగ అధికారులు స్పందించారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి తెలుగుగంగ ప్రధాన కాల్వకు నీరు విడుదల చేసినట్లు ఏఈ మోహనక్రిష్ణరెడ్డి బుధవారం తెలిపారు. తుండ్లవాగు రిజర్వాయరుకు వంద క్యూసెక్కులు నీరు చేరుతోందని వివరించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సంజామల, ఫిబ్రవరి 7: సంజామలలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగకుమార్ బుధవారం తెలిపారు. ఎంపీపీ పోచా రమాదేవి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలన్నారు.

తప్పుల తడకగా ఓటరు జాబితా


డబుల్ ఎంట్రీ పేరు ఉన్న కొత్తమిద్దె రామిరెడ్డి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 7: కోవెలకుంట్ల మండలంలోని పలు గ్రామాల్లోని ఓటరు జాబితా తప్పుడు తడకగా తయారైంది. వీటిని సవరించాల్సిన ఎన్నికల అధికారులు, బీఎల్‌వోల నిర్లక్ష్యం వల్ల చివరకు తుది జాబితాలో కూడా తప్పులు దొర్లాయి. ఈ లోపాలను సరిదిద్దేది ఎన్నడో అర్థం కావడంలేదు. డబుల్ ఎంట్రీ, చనిపోయిన పేర్లు తొలగించకపోవడంతో, గ్రామంలో ఉండకుండా వేరోచోట నివాసం ఉంటూ అక్కడ ఓటు, ఇక్కడ మరో ఓటు ఉన్నవారికి గుర్తించి తొలగించకపోవడంపట్ల విమర్శలకు తావిస్తోంది. మండలంలోని వల్లంపాడు గ్రామంలో 620 ఓట్లు ఉన్నాయి. వీటిలో 633 వరుస సంఖ్యలో కొత్త మిద్దెరాముడు, 635లో మిద్దెరాముడు పేర్లు ఉన్నాయి. అలాగే 294 వరుస నంబరులో ఈడిగ లక్ష్మీదేవి, 591లో కత్తిసోమక్క మృతి చెంది మూడేళ్ల గడిచినా తొలగించలేదన్నారు.


మరికొంత మంది వేరో ప్రాంతంలో నివాసం ఉన్నా వారి పేర్లు తొలగించడం లేదు. 487 వరుస నంబరులో తలారి చిన్నశ్రీనివాసులు రెండేళ్ల నుంచి గ్రామంలో లేకపోయినా ఆయనకు ఓటుహక్కు కల్పించారు. అలాగే వరుస సంఖ్య 322 గోనవరం మనీష నాలుగేళ్ల నుంచి బేతంచెర్లలో నివాసం ఉంటోంది. ఆమె స్థానికంగా లేకున్నా ఆమె పేరు తొలగించలేదు. వరుస నంబరు 268లో గార్లపాటి లక్ష్మీదేవి, మృతి చెందినా ఆమె పేరు తొలగించలేదు. 149 వరుస నంబరులో తలారి నరసయ్య 10 ఏళ్లనుంచి స్థానికంగా లేకపోయినా ఓటుహక్కు కల్పించారు. ఇలా గ్రామంలో సుమారు 18 పేర్లు వివిధ కారణాలతో ఓటరు జాబితాలో ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఓటరు జాబితాను సర్వే చేయించి డబుల్ ఓట్లు, మృతి చెందినవారి ఓట్లు, గ్రామంలో లేని వారి ఓట్లు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అగ్రికల్చర్, పాలిటెక్నిక్ కళాశాలలకు గ్రీన్ సిగ్నల్


మంత్రి బుగ్గనను కలిసిన మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, సుమిత్ర దంపతులు

డోన్, ఫిబ్రవరి 7: డోన్‌లో అగ్రికల్చర్, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ మేరకు బుధవారం అమరావతిలో సీఎం జగన్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో ఆమోదం తెలిపారు. వ్యవసాయ రంగంలో రెండేళ్ల డిప్లమా కోర్సుతో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ పరిధిలో ఈ కళాశాల పని చేయనుంది. డోన్‌లో కొత్తగా హార్టికల్చర్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. డా.వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ పరిధిలో ఈ కళాశాల పని చేసేలా ఆమోదం తెలిపారు. కళాశాలల ఏర్పాటుకు చొరవ తీసుకున్న మంత్రి బుగ్గనను సచివాలయంలో డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్, సుమిత్ర దంపతులు కలిసి అభినందనలు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న బ్రహ్మానందాచారి

బనగానపల్లె, ఫిబ్రవరి 7: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బ్రహ్మానందాచారి అన్నారు. బుధవారం మండలంలోని పలుకూరు గ్రామంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటుందన్నారు. హెచ్‌ఎం మల్లిఖార్జున, ఉపాధ్యాయులు మధుకిశోర్, హుసేన్, విశ్వభారతి, కొండలరావు, శేషు పాల్గొన్నారు.

కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలి

ప్యాపిలి, ఫిబ్రవరి 7: మాదసి, కురవలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని ఆ సంఘం నేతలు జలదుర్గం మద్దిలేటి, వెంకటప్ప తదితరులు ఎంపీడీవో సాయి మనోహర్‌ను కోరారు. ఈ మేరకు వారు ఆయన వినతి పత్రం అందజేశారు. తమ సామాజిక వర్గానికి గతంలో ప్రభుత్వం ఎస్సీ సర్టిఫికెట్ అందజేయాలని జీవో జారీ చేసిందని వినతి పత్రంలో పేర్కొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రారంభం

డోన్(రూరల్), ఫిబ్రవరి 7: మండలంలోని కమలాపురం గ్రామంలో రూ.35 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాలును ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. సర్పంచు రేగటి అర్జున్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీరాములు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ రామచంద్రుడు, కమలాపురం గ్రామ నాయకులు బుగ్గన జయచంద్రారెడ్డి, బొబ్బల శివరామిరెడ్డి పాల్గొన్నారు. అలాగే మండలంలోని గోసానిపల్లెలో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు.

చల్లా కాలనీకి తాగునీరు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి, 7: మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సహకారంతో కొలిమిగుండ్ల గ్రామంలోని చల్లా కాలనీలో ఏర్పడిన తాగునీటి సమస్యను మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పరిష్కార చర్యలు చేపటారు. కాలనీలో సుమారు 60 కుటుంబాలు నివసిస్తున్నాయి. కాలనీకి తాగునీటి సరఫరా తరచూ అంతరాయం కలుగుతుండటంతో టీడీపీ కార్యకర్త ఉలువల ప్రసాద్ బీసీ దృష్టికి తీసుకవెళ్లడంతో ఆయన పరిష్కార చర్యలు చేపట్టారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు: సీఐ


కలుగోట్లలో మాట్లాడుతున్న సీఐ జయచంద్ర

కోవెలకుంట్ల, ఫిబ్రవరి, 7: గ్రామాలలో ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర హెచ్చరించారు. బుధవారం రేవనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కలుగోట్లలో ఏర్పాటు చేసినా గ్రామ సభలో సీఐ జయచంద్ర, ఎస్‌ఐ రామమోహన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజలంతా ప్రశాంతంగా జీవించాలన్నారు. మద్యం, మట్కా పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆళ్లగడ్డ: వచ్చే ఎన్నికల్లో ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని రూరల్ సీఐ హనుమంత నాయక్ హెచ్చరించారు. ఆళ్లగడ్డ మండలంలోని అహోబిలం గ్రామస్తులతో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే పోలీసు అధికారుల దృష్టికి తీసుకరావాలే తప్ప ఘర్షణలకు పాల్పడరాదని సూచించారు. కార్యక్రమంలో అహోబిలం గ్రామ ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అందరికీ చేరాలి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 7: రేషన్ బియ్యం అర్హులైన కార్డుదారులందరికీ అందేలా చూడాలని పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగినా చర్యలు తీసుకుంటామని కోవెలకుంట్ల తహసీల్దారు జయప్రకాశ్ పేర్కొన్నారు. బుధవారం తహసీల్దారు కార్యాలయంలో నూతనంగా తహసీల్దారు జయప్రకాశ్ బాధ్యతలు చేపట్టారు. వీఆర్‌వోలు, డీలర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం సరఫరా చేసే సరుకులు సక్రమంగా అందేలా చూడాలన్నారు. అనంతరం పట్టణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఉన్నతపాఠశాల, గాంధీ పాఠశాల, స్పెషల్ పాఠశాలలను తనిఖీ చేశారు. డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్ ఆర్‌ఐ ఇమ్రాన్, వీఆర్‌వోలు నాగమద్దిలేటి, చెన్నయ్య, బాలమద్దిలేటి, పుల్లయ్య, రాజశేఖర్, సుబ్బనాయుడు పాల్గొన్నారు.

నందవరంలో మహా కుంభాభిషేకం

బనగానపల్లె, ఫిబ్రవరి 7: మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో మహా కుంభాభిషేక మహోత్సవం ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామానుజన్ బుధవారం తెలిపారు. ఆలయం గర్భాలయంలోని అమ్మవారి విగ్రహానికి స్వల్ప మరమ్మతు పనుల కారణంగా అమ్మవారి నిజరూప దర్శనం రద్దు చేశామని అన్నారు. మూల విరాట్ స్థానంలో గర్భాలయం ఎదురుగా ఉన్న మండపం లోని శ్రీచక్రం వద్ద బాలాలయం ఏర్పాటు చేసి అక్కడ అమ్మవారి ప్రతి రూపాన్ని ప్రత్యేకంగా మేడి చెక్కతో తయారు చేసి ప్రాణ ప్రతిష్ఠ చేసి మూడున్నర అడుగుల అమ్మవారి విగ్రహానికి తాత్కాలికంగా పూజలు నిర్వహిస్తున్నారు. మూల విరాట్ విగ్రహం మరమత్తులు పూర్తి కావడంతో ఫిబ్రవరి 10 నుంచి మహాకుంభాభిషేకం మహోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో తెలిపారు.

ఎంఈవో సేవలు మరువరానివి

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 6: ఆళ్లగడ్డ ఎంఈవో శోభావివేకవతి సేవలు మరువరానివని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అధ్యక్షుడు అమీర్‌బాషా అన్నారు. పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో ఆమెను బుధవారం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఘనంగా సన్మానించారు. గత నెలలో ఎంఈవో శోభావివేకవతి డీఈవో సుధాకరరెడ్డి నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకోవడంతో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అమీర్‌బాషా చెప్పారు.